క్లుప్తంగా

ముగిసిన పశు పక్షోత్సవాలు

రామాపురం : జనవరి 20 నుంచి 31 వరకు మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో పశు పక్షోత్సవాలు సందర్భంగా ఒక్కో పంచాయతీలలో రెండు గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మాట్లాడుతూ పశు ఆరోగ్య శిబిరాలకు విచ్చేసిన పాడి రైతులకు పశువులలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించి 1,411 పశువులకు ప్రథమ చికిత్స అందించి, 284 గర్భకోశ సమస్యలు ఉన్న పశువులకు చికిత్సలు అందించి, 2,590 పశువులకు, 1,171 దూడలకు 34,680 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్టు తెలియజేశారు.

ఉద్యోగ మేళాకు స్పందన

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గ్లోబల్ ట్రస్టు చైర్మన్ పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు స్పందన లభించింది. పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి పలువురిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

భక్తులు సమర్పించిన వస్త్రాలు వేలం


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన పట్టు చీరెలు, పంచెలు, కండువాలను వేలం నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో 800 చీరెలు, 580 పంచలు, 205 కండువాలు, 63 టవళ్లను వేలం పాటలో ఉంచారు. ఇందులో రాయచోటి పట్టణంలో ఎస్ఎన్ కాలనీకి చెందిన ఎస్.శ్రీరాముల శెట్టి రూ.2,10,000లకు వస్త్రాలను దక్కించుకున్నారు. ఈ వేలం పాటను దేవాదాయ శాఖ అధికారి రవికుమార్ పర్యవేక్షించగా మిగిలిన ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. నగదు మొత్తాన్ని ఫిబ్రవరి 1వ తేదీ ఎస్‌బీఐలో జమ చేయనున్నట్లు ఈఓ తెలిపారు.

డ్రంక్ డ్రైవ్ కేసులో 12 మందికి జరిమానా

రాయచోటి టౌన్ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 12 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని తనిఖీ చేయగా నేరుసుపల్లె తాళేశ్వరరెడ్డి, షేక్ దర్బార్ బాష, పల్లపు నరేష్, యాడికి నాగరాజు, షేక్ చాన్ బాషా, చప్పిడి సుధాకర్, గండికోట నాగరాజ, పాలగిరి అహమ్మద్, పూల మరియన్న, దాసరి మదన్‌మోహన్, తలారి గణేష్, గువ్వల ప్రసాద్‌లు పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెట్టినట్లు తెలిపారు. విచారించిన న్యాయస్థానం ఒక్కొక్కరికి రూ.10,500ల చొప్పున జరిమానా విధించారు. అలాగే రాంగ్ రూట్లో వాహనాలు నడిపినందుకు శెట్టిపల్లి కుమార్, షేక్ రహమత్‌బాషా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా విచారించిన కోర్టు ఒక్కొక్కరికి రూ.1250ల చొప్పున జరిమానా విధించినట్లు తెలియజేశారు.

విధుల్లోకి తీసుకోకుంటే సమ్మెకు సిద్ధం


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సబ్ స్టాఫ్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ పాఠశాలలో తొలగించిన పది మంది సబ్ స్టాఫ్‌ను విధుల్లోకి తీసుకోకుంటే అందరినీ కలుపుకొని సమ్మెకు సిద్ధమవుతామని సబ్ స్టాఫ్ తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానిక ఎంపీడీఓ మల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏపీఎండీసీ పాఠశాల ఎదురుగా సబ్ స్టాఫ్ చేస్తున్న నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఏపీఎండీసీ యాజమాన్యం తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేకుంటే ఏపీఎండీసీలో పని చేస్తున్న అందరినీ కలుపుకొని సమ్మె బాట పడతామని తెలియజేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సీఐటీయు మండల నాయకులు, తొలగించిన ఉద్యోగులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు సకాలంలో అందజేయాలి


డీలర్లకు సూచనలు, సలహాలు ఇస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీను

పుల్లంపేట : నిత్యావసర సరుకులు సకాలంలో పేదలకు పంపిణీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీను పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అందించే నిత్యావసర సరుకులు బియ్యం, పంచదార గడువు లోపు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ముఖ్యంగా తూకాలు సక్రమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద కిషోర్, ఆర్ఐ, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలను తలపించేలా.!

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు తర్వాత రాజంపేటలో దసరా ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతాయి. దసరా ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు మూడేళ్ల కోమారు జరుపుతుంటారు. ఈ ఎన్నికలను ఆర్యవైశ్యులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు. అధ్యక్షుడి ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు జరగడం, దీనికి తోడు అభ్యర్థుల ప్రచారాలు దాదాపు సాధారణ ఎన్నికలను తలపించేలా ఉండటం వల్ల ఆర్యవైశ్య సంఘం ఎన్నికలపై సాధారణ ప్రజలు కూడా ఆసక్తి కనబరుస్తారు. ఇదిలావుంటే ఫిబ్రవరి 9వ తేదీ జరిగే ఆర్యవైశ్య సంఘం ఎన్నికల బరిలో నిలిచేందుకు తొలుత ఏడు మంది నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఈనెల 29వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ సమయానికి నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ప్రస్తుతం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఉన్న గ్రంధే సత్యనారాయణ గుప్తాతోపాటు అన్నం సుబ్బరాయుడు, ప్రకాష్‌రావు బరిలో నిలవడంతో త్రిముఖ పోటీ నెలకొంది.


రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాల




సత్యనారాయణ గుప్తా, అన్నం సుబ్బరాయుడు, ప్రకాష్‌రావు

ఏకగ్రీవమైన ఆరు వార్డులు

ఆర్యవైశ్య సంఘంలో మొత్తం ఏడు వార్డులు ఉంటాయి. ఇందులో ఒక్కో వార్డు నుంచి ముగ్గురు అభ్యర్థులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే ఐదవ వార్డుకు మినహా మిగతా వార్డులన్నీ ఏకగ్రీవమయ్యాయి. ఐదవ వార్డుకు నలుగురు అభ్యర్థులు బరిలో నిలుచోవడంతో పోటీ అనివార్యమైంది. ఇది లావుంటే వార్డు మెంబర్లుగా ఎన్నికైన వారిని ఏడాదికి కొంతమంది చొప్పున దసరా ఉత్సవ కమిటీకి ఎంపిక చేస్తారు. దసరా ఉత్సవ కమిటీలో ఉన్న వారు ఉత్సవాలను ముందుండి నడిపిస్తారు. కాగా అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తి కార్యదర్శి, కోశాధికారి, ఇతర కార్యవర్గ సభ్యులను నియమించుకుంటాడు.

మొదలైన ప్రచార పర్వం

ఆర్యవైశ్య సంఘం ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో అభ్యర్థులు ప్రచార పర్వానికి తెరలేపారు. ఎన్నికలకు పదిరోజులు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ఓటర్లతో తమకున్న బంధుత్వం, వారి పెద్దలతో ఉన్న సాన్నిహిత్యం వంటివి గుర్తు చేసి ఓటర్లను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఐదు వందలలోపు ఓట్లు మాత్రమే ఉన్నప్పటికీ అభ్యర్థులు మాత్రం నిత్యం ఉదయం, సాయంత్రం ఈ పది రోజులపాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించనున్నారు. అందువల్ల ఆర్యవైశ్యులు ఎక్కువగా ఉండే అమ్మవారిశాల, బండ్రాళ్లవీధి, నాగులమానువీధి, పొట్టిశ్రీరాములువీధి, రైల్వేస్టేషన్ ఏరియాల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది. ఇదిలావుంటే ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. అది కూడా ఆ కుటుంబంలోని వ్యక్తి ఆర్యవైశ్య సంఘంలో సభ్యుడై ఉండాలి. ఐదవ వార్డుకు చెందిన ఓటర్లు ఒక ఓటు వార్డు సభ్యుడిగా బరిలో నిలిచిన వారికి మరొక ఓటు అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న వారికి వేయాల్సివుంటుంది.

ఓటర్ల సంఖ్య	- 493
పోలింగ్ తేదీ	- ఫిబ్రవరి 9వ తేదీ
సమయం	- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు
కౌంటింగ్	- సాయంత్రం 6 గంటల నుంచి

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న శరత్‌కుమార్‌రాజు

రాజంపేట రూరల్ : విద్యార్థులను విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని శాన్వీ ఇంటర్‌నేషనల్ స్కూల్ చైర్మన్ కొండూరు శరత్‌కుమార్‌రాజు కోరారు. మండల పరిధిలోని కె.బోయినపల్లి వద్ద నున్న ఎల్లాగడ్డలోని శాన్వీ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో శుక్రవారం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా స్కూల్ అధ్యాపకులు, అతిథులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా మండల స్థాయిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి క్రీడా పోటీలకు హాజరైన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు వై.సుబ్రమణ్యంరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైఎస్ ప్రిన్సిపల్ వెంకటనరసయ్య, శాన్వీ ప్రిన్సిపల్ విజయనిర్మల, డైరెక్టర్ కె.భరత్‌కుమార్‌రాజు, ఎండీ శంకరరాజు, వైస్ ప్రిన్సిపల్ జయశ్రీ, పీఈటీలు సురేష్, ఆనంద్, జె.మోహన్, యు.ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ పాఠశాలల పీఈటీలు ఎ.ఈశ్వరనాయక్, ఎన్.సరిత, బి.పెంచలమ్మ, బి.నాగరాజు, ఎం.రమేష్, జి.ఆనందమ్మ, ఎన్.సుధాకర్, ఎన్‌వీ రమణలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలి


సిద్దవటానికి చేరిన సీపీఎం జీపు జాత

సిద్దవటం : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జమ్మలమడుగు నుంచి గురువారం మొదలైన జీపు జాతా కార్యక్రమం శుక్రవారం సిద్దవటానికి చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ నెల్లూరులో జరిగే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలన్నారు. కడప జిల్లాకు కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ఉక్కు పరిశ్రమను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, భైరవ ప్రసాద్, పోరుమామిళ్ల మండల శాఖ కార్యదర్శి సుబ్బమ్మ, సిద్దవటం మండల కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేయడమే కూటమి నైజం


బాధితులతో మాట్లాడుతున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం, స్థానిక నాయకుల ఆలోచనల వల్లే పేదలకు అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని చర్చి నుంచి పొట్టి శ్రీరాములు వీధిలోకి వెళ్లే రహదారిలో దుకాణాలు కూల్చడం హేయమైన చర్య అన్నారు. అలాగే బాధితులతో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు పనులు చేసుకోవడానికి, డబ్బులు సంపాదించుకోవడానికి పేదల కడుపుకొడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో చిరు వ్యాపారులకు టోల్ చార్జ్‌ను రద్దు చేశామని, కూటమి ప్రభుత్వం వారికి బతుకే లేకుండా చేస్తోందని విమర్శించారు. బాధితులకు న్యాయం చేయకుంటే ప్రజలు తరపున అండగా ఉండి నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

పరామర్శ

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్ అనారోగ్యరీత్యా తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. కార్యక్రమంలో శివారెడ్డి, పునీత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు వాసికి మొదటి బహుమతి


టీవీని నాగేంద్ర దంపతులకు అందజేస్తున్న ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి

పెనగలూరు : సూపర్ కేలో రాష్ట్ర వ్యాప్తంగా తీసిన డ్రాలో పెనగలూరు వాసికి మొదటి బహుమతి కింద 65 ఇంచ్‌ల టీవీని ఎస్ఐ రవికుమార్ రెడ్డి చేతుల మీదుగా ఏరియా మేనేజర్ చంద్రశేఖర్, ప్రహ్లాద రెడ్డి, పూజారి సుబ్రమణ్యంలు అందజేశారు. అలాగే కొత్తపల్లికి చెందిన హరిత, వెంకటేశు, కంబాలకుంట వినయ్, సిరి, సుబ్బయ్యలకు మిక్సీలు, గ్రైండర్లు అందించారు. కార్యక్రమంలో మెకానిక్‌లు శివ, షామీర్ బాషా, కెసి విజయ్ కుమార్, బాల పెంచలయ్య, సిమెంట్ ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు నడపండి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న తల్లెం భరత్‌రెడ్డి

ఓబులవారిపల్లె : కుంభమేళాలో ఈ ప్రాంతం ప్రజలు వెళ్లడానికి ప్రత్యేక రైలు నడిపించాలని జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి కోరారు. శుక్రవారం రేణిగుంట రైల్వేస్టేషన్‌లో గుంతకల్లు డివిజన్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఓబులవారిపల్లె జంక్షన్ రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి, తిరుమల ఎక్స్‌ప్రెస్, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ కల్పించాలని, రైల్వేకోడూరు, రాజంపేట, నందలూరు, పుల్లంపేట స్టేషన్ నందు కోవిడ్‌కు ముందు నిలబడుతున్న రైలు అన్నింటికీ స్టాపింగ్ కల్పించాలని తల్లెం భరత్ కోరారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు.

నూతన నియామకం


మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని సత్కరించిన అబుజర్

రాయచోటి టౌన్ : బీఎస్ఎన్ఎల్ జిల్లా టెలికాం కమిటీ సభ్యుడిగా షేక్. అబుజర్‌ను నియమించారు. ఈ మేరకు ఆయన రాయచోటి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ టెలికమ్యూనికేషన్ సమస్యల పరిష్కారం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గడికోట అబుజర్‌ను అభినందించి, ప్రజలకు సేవలను చేరువ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి జగదాంబసెంటర్ : విద్యుత్ సంస్థలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 23,500 మంది కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. వారి సమస్యలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్కం అధ్యక్షులు సుబ్రమణ్యంరాజు, డివిజన్ అధ్యక్షులు నాగేష్ గౌడ్, యూనియన్ డివిజన్ కార్యదర్శి ఏవీ రమణ, కాంట్రాక్ట్ కార్మికులు జగదీష్, రామాంజుల్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

సీఐ సుబ్బారెడ్డికి సతీవియోగం


సరళాదేవి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట రూరల్ : మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పోలీ వెంకటసుబ్బారెడ్డి సోదరుడు, సీఐ పోలీ సుబ్బారెడ్డి సతీమణి పోలీ సరళాదేవి(45) అనారోగ్యంతో గురువారం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండల పరిధిలోని చిన్నిల్లుగారిపల్లికి సరళాదేవి మృతదేహాన్ని తీసుకొచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చిట్వేలి, ఓబులవారిపల్లె మండల కన్వీనర్లు చెవ్వు శ్రీనివాసులరెడ్డి, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ముద్దా శివశంకర్‌రెడ్డి, సిద్దవరం గోపిరెడ్డి, కటారు రఘురామిరెడ్డి, పాపినేని విశ్వనాథరెడ్డి, రంగాల కమలాకర్, దాసరి పెంచలయ్య, రంగాల గురుమూర్తి, జీవీ సుబ్బరాజు తోపాటు సీఐ కుటుంబ సభ్యులు, పోలీసు అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని నివాళులు అర్పించారు.

పదవీ విరమణ

రాయచోటి టౌన్/సిద్దవటం : రాయచోటి ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఇనాయతుల్లా శుక్రవారం పదవీ విరమణ పొందారు. అలానే సిద్దవటం మండలంలోని పి.కొత్తపల్లె పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న శంషాద్‌బేగం పదవీ విరమణ పొందగా ఆయా కార్యాలయాల సిబ్బంది వారిని ఘనంగా సన్మానించి వారి చేసిన సేవలను కొనియాడారు.


సిద్దవటం: శంషాద్‌బేగంను సన్మానిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది


రాయచోటి టౌన్: ఎస్ఐ ఇనాయతుల్లాను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

వివక్షతను రూపుమాపడమే లక్ష్యం


సామాజిక స్థితిగతులను తెలుసుకుంటున్న అధికారులు

సుండుపల్లె : వివక్షతను రూపుమాపడమే ప్రభుత్వాల లక్ష్యమని తహసీల్దార్ దైవాదీనం అన్నారు. శనివారం మండల పరిధిలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రాంతమైన పెద్దినేని కాల్వ గ్రామ పంచాయతీలోని అరుంధతివాడలో ఆయన పర్యటించి సామాజిక స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లో, నీటి కుళాయిలు దగ్గర, దేవాలయాల దగ్గర అగ్రవర్ణాల నుంచి కులపరమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తహసీల్దార్ విచారించారు. అనంతరం అంటరానితనం గురించి గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్, వీఆర్ఓలు ప్రసాద్, నరసింహులు, వీఆర్ఏ మల్లికార్జున, పాల రెడ్డయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించి ఆదుకుందాం


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న వెంకటరమణ

రైల్వేకోడూరు అర్బన్ : గ్రామీణ స్థాయిలో ఉన్న పేదలకు వైద్యం అందించి ఆదుకుందామని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు పలుకూరి వెంకటరమణ కోరారు. మండల పరిధిలోని జ్యోతి లెప్రసీ కాలనీలో శెట్టిగుంట వైద్య బృందం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్, అడిషనల్ డీఎంహెచ్‌ఓ సౌజన్య, డాక్టర్ శైలజ, ఓబిలేసు తదితరులు కంటి పరీక్షలు చేశారు. అనంతరం 36 మందికి కంటి అద్దాలను సంస్థ సభ్యులు, వైద్యులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శివాజీ, మణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


రహదారి భద్రతా నిబంధనలను తెలియజేస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లి : ఆటో డ్రైవర్లు పరిమితికి మించి అధిక లోడుతో వెళ్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రవీంద్రబాబు ఆటో డ్రైవర్లకు హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలో పరిమితికి లోపే ప్రయాణికులను తీసుకెళ్లాలని, అధిక లోడుతో వెళ్లడం వలన ఆటోలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతాయని, కావున అధిక లోడుతో వెళ్లకుండా నెమ్మదిగా గమ్యాన్ని చేరుకోవాలని సూచించారు. మద్యం సేవించి ఆటోను నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలపరాదని, ఆటోస్టాండ్ వద్ద ఆటోను నిలపాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 20 లీటర్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం మండలంలోని ముష్టూరు పంచాయతీ ఎరప్పగారిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో యరప్పగారిపల్లికి చెందిన ఉడుం రవి (37) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కన్యకాంబ.. నమోస్తుతే

రాజంపేట టౌన్ : ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే అమ్మవారిశాలలో కొలువైన వాసవీ మాత మూలవిరాట్‌కు విశేషంగా పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారి వ్రతాన్ని ఆచరించారు. అలాగే వాసవీమాత ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం పురోహితులు పూజలు నిర్వహించి వాసవీమాత ప్రతిమను గుండప్రవేశం చేయించారు. దీంతో భక్తులు పెద్దఎత్తున గుండప్రవేశం చేశారు. భక్తులు జైమాత, వాసవీమాత, ఓం నమోఃవాసవాంబయ అంటూ నినదించడంతో వాసవీమాత నామస్మరణ మార్మోగింది. పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా గట్టి చర్యలు చేపట్టారు.


వాసవీమాత వ్రతాన్ని జపిస్తున్న మహిళలు


రాజంపేట టౌన్: వాసవీమాతను దర్శించుకుంటున్న ఆకేపాటి


నందలూరు: పూజల్లో పాల్గొన్న ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి


రైల్వేకోడూరులో..


రామాపురంలో..


నందలూరు: హోమ పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు


రాజంపేట టౌన్: కన్యకా పరమేశ్వరి గ్రామోత్సవంలో ఆర్యవైశ్యులు

గ్రామర్ పుస్తకాలు పంపిణీ

రాజంపేట రూరల్ : పది విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని దాతలు వేణుగోపాల్, సోదరి అన్నపూర్ణమ్మలు ఆకాంక్షించారు. శుక్రవారం వారు అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు, కథానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు అబ్బిగారి రాజేంద్రప్రసాద్ 4వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు గ్రామర్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొత్తపి వెంకటరమణ, ఉపాధ్యాయులు వెంకటేష్, వేంకట సుబ్బయ్య, రామయ్య, విజయకుమార్, అనురాధ, బాబు, నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.